# లేడీడాక్టర్ భర్త

డాక్టర్ మిస్, రామేశ్వరి యం.బి.బి.ఎస్ అనే బోర్డుగల పెద్ద భవనంముందు శ్రీ దయాసాగర్రావు గారి కారు ఆగడం అందరికీ విస్మయాన్ని కలిగించింది.

ఆయన, మోయలేకపోతున్న భారీశరీరాన్ని తప్పక మోస్తున్నట్టు బరువుగా అడుగులు వేసుకుంటూ, మెట్లెక్కి వెళ్ళాడు.

"కన్సల్టింగ్ రూం" ఖాళీగానేవుంది. ఒక నర్సుజోళ్ళు చప్పుడు చేసుకొంటూ వచ్చి "కూచోండి, సార్! ఇప్పుడే డాక్టరమ్మ–లోపల తొందర కేసేదో వుంటే చూస్తున్నారు" అంది. చిరునవ్వు తెచ్చి పెట్టుకుంటున్న మొహంతో.

ఆయన వీలుగా వున్న పెద్దకుర్చీమీద సుఖాసీనులయ్యారు. కాని మొహంలో చెప్పలేని ఆందోళన వ్యక్తమవుతోంది.

'ఉస్' అని ఒకనిట్టూర్పు విడిచారు, ఉపశమన పూర్వకంగా.

ఆయన అదృష్టమా! అన్నట్టు లేడీడాక్టర్ వెంటనే వొచ్చింది. తువ్వాల్తో చేతులుతుడుచుకుంటూ. మెడలోంచి స్టెతస్కోప్ వేళ్ళాడుతోంది. వేళ్ళకొనలతో ముంగురుల్ని పైకి ఎగదోసుకుంది; వాటికి నీళ్ళతడి ఎక్కడ అంటుతుందా? అని భయపడుతున్నట్టుగా, నాజూగ్గా.

"ఏమండీ? ఇలా దయచేశారు?" అంది, నమస్కార ప్రతినమస్కారాలనంతరం.

"అర్జంట్, డాక్టర్, మీరు నాయింటికి రావాలి.

"ఏం?"

"నా వైఫ్ నొప్పులతో బాధపడుతోంది. మీరు తక్షణం, ఉన్నట్టుగా బయలుదేరాలి".

రామేశ్వరి ఆశ్చర్యపోయింది. ఆయన్ని గొప్ప ధనికునిగా, దేశముఖుల కుటుంబానికి చెందినవానిగా ఎరుగును కాని ఆయన తన దగ్గరకువచ్చి ఇలా ప్రాధేయపడడమేమిటి? టెలిఫోన్ కాల్చేస్తే సివిల్ సర్జనులే ఆయన గుమ్మంముందు స్వంతకారులో వాల్తారు. మనస్సులోనే ఆశ్చర్యపోయింది.

"ఐతే నడవండి" అంది లేస్తూ.

ఆయనా అతి కష్టంమీద కుర్చీని విడిచి లేవగలిగాడు.

ఇందాకటి నర్సు మళ్ళాచిరునవ్వు నవ్వుతూనే వొచ్చి, కారువద్ద బ్యాగ్ అందించింది.

ఈనర్సులు ఎప్పుడూ చిరనవ్వు ముఖాల్తోనేవుంటారు– ఎదుట యమయాతన పడుతున్న రోగుల్ని చూస్తూకూడా ఈ బాధలూ రోగాలూ రొచ్చులూ అలవాటవడంవల్లనో; వాళ్ళకి బాధలు లేకో; లేక అది వృత్తిరీత్యా వుండేటక్కరి తనమో.

## 2

దారిలో మనసులోని మాట రామేశ్వరి. చెప్పేసింది పెద్ద డాక్టర్లని వొదలి తన దగ్గరకు రావడానికి గల కారణమేమిటా? అని.

ఆయన గవర్నమెంట్ డాక్టర్లకు వ్యతిరేకంగా ఒక చిన్న ఉపన్యాసమిచ్చి తన భార్య అవస్థచెప్పి, ఆవిడ్నే నమ్ముకున్నా నన్నాడు.

రామేశ్వరికూడా ఆందోళచెందసాగింది. అది గొప్ప కేస్! నెగ్గిందా! అదృష్టవంతురాలే! రోగికి అంత ప్రమాదంగా వుండకూడదని మన్సులోనే కోరుకుంది.

దయాసాగర్రావుగారు భార్యకీ విషయం కొత్తకాదు. ఏ ఐదారేళ్ళకోగాని గర్భందాల్చదు. అప్పుడప్పుడు ఆ గండం గడవడమే కష్టమౌతుంది. ఆవిడ కాపరం చేసిన ఇరవై యేళ్ళల్లోను ఇది నాలుగుసార్లు జరిగిన విషయం. ప్రతిసారీ డాక్టర్లు ఆయన్ని "ఆవిడ పునర్జన్న ఎత్తినట్టు భావించండి" అనేవారు. ఆఖరికి కిందటిసారి "ఆవిడకు మళ్ళీ గర్భం కాకూడదనీ, ఐతే ప్రాణాపాయమని" అన్నాడు సివిల్ సర్జన్.

దయాసాగర్రావుకూడా ఆలోచించాడు. కాని ఆయనకు ఆ వయస్సులో గర్భనిరోధ పద్ధతుల్ని అవలంబించడం సిగ్గనిపించింది. ఐనా వాటిల్లో అంతగా నమ్మకం ఏర్పడలేదు కూడా.

డాక్టర్ రామేశ్వరమ్మ రోగిని బాగా పరీక్షించింది.

పరిస్థితి అతి సీరియస్‌గా వున్నట్టు గ్రహించింది. వెంటనే తగిన మందులు, మాకులు ఇయ్యసాగింది. కాని రాత్రంతా అక్కడే వుండాల్సిన అవసరం ఏర్పడింది. మాతా శిశువుల్లో ఎవరో ఒకరు మరణించక తీరనిస్థితి వొచ్చిపడింది.

బయటకురాగానే దయాసాగర్రావుగారు "ఏమిటి డాక్టర్? ఎలావుంది?" అని ప్రశ్నించాడు. అంత గొప్పవాడు ఆపత్కాలంలో చిన్న పిల్లవాడైపోయినట్టు తోచసాగాడు.

రామేశ్వరికి ఏం చెప్పాలో తెలీలేదు. అది తెగని సమస్య! డాక్టర్లెం సహృదయులో, వృత్తిదృష్ట్యా అంత కఠినాత్ములుకూడా! లేకపోతే అంత భయంకరాలైన ఆపరేషన్లు అలా చెయ్యనేలేరు.

అందుకనే రామేశ్వరి అసలువిషయాన్ని వెళ్ళగక్కింది. ప్రమాదం సంగతి.

"ఇద్దర్నీ బ్రతికించండి డాక్టర్! జన్మ జన్మాలకూ మీకు రుణపడివుంటాను" అని ఆయన ప్రాధేయపడసాగాడు.

"ప్రయత్నిస్తా" అని అతనికి ధైర్యంచెప్పి, మళ్ళీ ఆవిడ తన పనిలో నిమగ్నురాలైంది. కూడా వొచ్చిన నర్సు ఆవిడకి తోడ్పడసాగింది. దయాసాగర్రావుగారు విచారసాగరంలో మునిగి తేలుతున్నారు.

## 3

అసంభవమైన విషయాలెప్పుడూ సాధ్యపడవు. మానవప్రయత్నం ఎంతబలంగావున్నా, ఆ దుర్భర సత్యాన్ని భరించలేకే మానవాతీతశక్తుల్ని ఆరాధిస్తారు ఆత్మశక్తి తక్కువైన మానవులు.

ఆపరేషన్ జయప్రదమైంది; శిశువు మాత్రం బ్రతికింది.

అన్నాళ్ళకు పుత్రప్రాప్తికలిగినందుకు ఆనందం చిరకాలం సహధర్మచారణి చచ్చిపోయినందుకు విచారం రెండూ రెండువైపులకు లాగగా, దయాసాగర్రావుగారు వెర్రివారైపోయారు. పిల్లవాణ్ణి చూసి కడుపు చెక్కలయ్యేలా ఏడ్చాడు.

తల్లిని బ్రతికించాలని తనుచేసిన ప్రయత్నమంతా గంగలో కల్సినందుకు చాల విచారించింది, డాక్టర్ రామేశ్వరమ్మ.

వృద్ధాప్యంలో ఆయనకు గలిగిన దురవస్థకు వగచిన దయార్ద్రహృదయులు కానివారెవరూలేరు ఆ వూళ్లో – దయాసాగర్రావుని ఎరిగినవాళ్ళూ, ఎరగనివాళ్ళూ కూడా!

డాక్టర్గారే ఒక ప్రత్యేక నర్సుని పిల్లవాడ్ని సాకడానికి ఏర్పరిచింది. ఆ నర్సు దాదాపు ఇరవైనాలుగు గంటలూ వీళ్ళింట్లోనే వుండి, 'కౌ అండ్ గేట్' మిల్కు సహాయంతో పిల్లవాడ్ని పెంచసాగింది.

ఆరునెల్లు అతి కష్టంమీద గడిచాయి. దయాసాగర్రావుగారు తక్కిన వ్యావృత్తులన్నీ మాని, ఎక్కువ కాలాన్ని తనకొడుకు పోషణమీదా, అతన్నాడించడంలోనూ గడిపేవాడు.

డాక్టరు రామేశ్వరమ్మ వారానికోసారి వొచ్చి పిల్లవాని ఆరోగ్యాన్ని పరీక్షించివెడుతుండేది ప్రతి ఆదివారం.

ఆయనకు బంధుకోటికూడా ఎక్కువగానేవుంది. కాని కష్టకాలంలో వాళ్ళంతా ఎవళ్ళంత వాళ్ళు జారుకున్నారు. దానికి ప్రత్యేక కారణంకూడా లేకపోలేదు. కొడుకు తల్లి గండాన పుట్టేడు. అటువంటివాడి పోషణభారం వహిస్తే ఏ సంసారంలో ఏముప్పు వస్తుందోననే భీతి అందిరిలోనూ అజ్ఞాతంగా పనిచేసింది. అందుకని అంతా తగ్గేరు.

దానికి ఆయనేం దిగులుపడడు. బాగా చదువుకున్న వాడైన మూలాన, ఈచుట్టాలంతా దీపంచుట్టూ చేరే శలభాలవంటివారని ఆయన ఎరుగును. దీపం ఆరేవరకూ అంటి పెట్టుకుని వుంటారు ఆ తర్వాత కనపడరు, అదే వాళ్ళనైజం,

ఆయనకు స్నేహితురాలు, బంధువూ, పెద్దదిక్కు, సలహాదారూ అన్నీ డాక్టరు రామేశ్వరమ్మే!

ఆదివారం సాయంత్రం హాస్పిటల్‌కు సెలవు, అపుడే దయాసాగర్రావుగారి వద్దకు పోతూంటుంది రామేశ్వరమ్మ. ఇద్దరూ గంటలతరబడి ప్రాపంచిక విషయాల్ని ఎన్నిటినో చర్చించుకునేవారు లోకపు పోకడలన్నీ వీటిలో దొర్లేవి రాజకీయాలనుండి సాంసారిక విషయాలవరకూ.

ఓనాడీ క్రింది సంభాషణ జరిగింది.

"డాక్టర్! ఒక విషయమడుగుతాను చెప్పండి. ఒక స్త్రీగాని, పురుషుడుగాని జీవితాన్ని సాంతం ఒంటరిగా గడపడం సాధ్యమవుతుందంటారా?"

ఆవిడ ఆలోచనలో పడింది. ప్రశ్నకు సమాధానం తోచకకాదు; ప్రశ్న అడగడంలో గుప్తార్థమేమన్నా వుందేమోనని.

"బయెలాజికల్‌గా ఆలోచిస్తే అది అసంభవమే కాని ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే అది సాధ్యమనిపిస్తుంది. కాని వాళ్ళల్లో మానసిక చాంచల్యంకూడా రాకుండావుండడం అసంభవం అనుకోవచ్చు".

"నా దురదృష్టంవల్ల ననండి; విధివైపరీత్యంవల్లననండి తిన్నగానో, పరోక్షంగానో నాభార్య నాకు దూరమవడానికి మీరేకారకులు. అలాగని మీమీద నేరం ఆరోపిస్తున్నానని భయపడకండి. నామనస్ఫూర్తి అయినకోరిక, తల్పుకుంటే మీరు సాధించజాలినదీ ఒక్కటే! మీరు ఖాళీచేసిన చోటును మీరే ఆశ్రయించి. నాపిల్లవాడికిమాతృభిక్షనీ, వృద్ధాప్యంలో నాజీవితానికి సహధర్మచారిణీ కలిగేలా చెయ్యాలని"

రామేశ్వరమ్మ ఆశ్చర్యపోయింది! తనను దయాసాగర్రావు - ఓ లక్షాధికారి - వివాహమాడబోతున్నాడు - తనకోరిక స్పష్టమైన భాషలో, గౌరవప్రదమైనరీతిలో విశదీకరించాడు. తను ఎందుకు అంగీకరించరాదు? ఎంతచదువు చదివినా, ఎన్ని వుద్యోగాలు చేసినా అంతా ధనంకోసమేగా అదీగాక స్త్రీ జీవిత పరమలక్ష్యం పత్నిత్వం; మాతృత్వం.

డాక్టరు రామేశ్వరమ్మకు దయాసాగర్రావుగారి మీద అనంతమైనదయగలిగింది.

డాక్టరు డైలమాలోపడింది, ఆయన కోర్కెను అంగీకరించడమా? తిరస్కరించడమా? అని.

తిరస్కరిస్తే అసలే భగ్న హృదయుడైన మానవుడు పిచ్చెత్తిపోయి, ఎందుకూ కొరగాని దుర్భరజీవిగా మారవచ్చు. లేదా ఏ హృద్రోగంతోనో మరణించవచ్చు.

అంగీకరిస్తే తన నొంటరిజీవితం పరిసమాప్తమౌతుంది. అడ్డమైన రోగాలతో, అదొకవృత్తిగా బాధపడడం తప్పుతుంది. చాతనైతే ప్రజాసేవగా - డాక్టరు పరీక్ష చదివినందుకు - చాతనైన సేవ చేయవచ్చు చివరికి ఏ నిశ్చయానికి రాలేకపోయింది.

దయాసాగర్రావుగారు 'తొందరేం లేదు. ఆలోచించే నిర్ణయించుకోండి! నన్ను చూసి కాకపోయినా, ఆ పసికందుని..." అంటూ కొసిరేడు.

ఆలోచనలో సతమతమౌతున్న ఆవిడ ఆవేళకి సెలవు తీసుకుని వెళ్ళిపోయింది.

వారంరోజులు!

డాక్టర్ రామేశ్వరమ్మ, దయాసాగర్రావుగారికి జరిగిన సంస్కార వివాహాన్ని అంతా కొనియాడేరు.

వాళ్ళపేర్లూ, ఫోటోలూ పేపర్లలో పెద్ద అక్షరాల్తో పడ్డాయి.

ఇద్దరూ ఆకస్మిక పరివర్తనలకి, తమ జీవితాలు త్రొక్కుతున్న నూతన దారులకీ తమలో తామే ఆశ్చర్యపోసాగేరు.

అసలువిషయాన్ని ఎరుగని పామరులు శ్రీ దయాసాగర్రావుగారు డాక్టరమ్మవల్లో పడ్డారనీ, అతనే డబ్బుచూపి ఆవిడని వల్లోవేసుకున్నాడనీ, ఎన్నో విధాలుగాపుకార్లు పుట్టించేరు – వాళ్ళ వీళ్ళ తీర్పు తీర్చేదెవరూ?

నూతన దంపతులు మాత్రం నిశ్చల మస్సులతో నూతన పథాలలో పురోగమించసాగేరు